# వయసు చెడ్డది

వయసు చెడ్డదంటే నేను మరీ వయసులో ఉన్నవాడిననుకోకండి. నాకు నాలుగో పది కనుచూపు మేరలో మీద పడబోతూంది. భార్యా, నలుగురు పిల్లలూ, ఇతరత్రా బాధ్యతలూ ఉన్నాయి.

కాని మనసు అదుపులో ఉండక పోవడం వయసు లక్షణమేనంటే, నేను వయసులో ఉన్నట్టే మనసులో మాట బయటకు అనేసే విసురు తగ్గని వయసుమరి. సిగ్గుపడి లాభం లేదు. అది అంతే.

భ్రమరాంబని అంత మాట అన్నందుకు ఈవయసులో వెనక్కి తిరిగి చూసుకుంటే కొంత బాధా, కొంత సిగ్గూ కలుగుతుంది. అంటే ఆమాట అన్నప్పటికీ ఇప్పటికీ నావయసులో ఎంతో తేడా లేదు. కొద్ది వారాలు మాత్రమే. చావు దగ్గర పడుతూందనుకున్నప్పుడు కించిత్ వైరాగ్యం ఏర్పడడం సహజం సాదా మనిషిలో పుట్టిన వాడిని - చావ వలసిన పరిస్థితే వస్తే సాదా మనిషిగానే చచ్చిపోవాలనుకున్నాను.

జనరల్ వార్డులోనే చేరుతా వన్నాను.

దీనికి - అదే ఈ నిశ్చయానికి చాలా కారణాలున్నాయి.

స్పెషల్ వార్డులో బెడ్ దొరకడం ఆలస్యమవచ్చు - ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటాయి ధనవంతుల ధనానికి చప్పున పలికే స్పెషల్ వార్డు గదులు. నేను అంత ధనవంతుణ్ణి కాదు.

రెండోది జనరల్ వార్డురో డాక్టర్లు స్పెషల్ వార్డులో కంటే పేషెంట్లకు అందుబాటులో ఉంటారు.

జనరల్ వార్డులో బెడ్‌కి పైస ఇవ్వక్కర్లా.

వడ్డించే వాడు మనవాడైతే చివరి పంక్తిలో కూచోమన్న నానుడి ఉండనే ఉంది.

ఆపరేషన్ ముందు రోజు సాయంకాలం ఒకమారు అలా వెళ్లి బెడ్ చూసుకు వద్దామని ఒక హౌస్ సర్జన్‌తో వార్డుకు వెళ్లాను. అతను

సిస్టర్‌ను కనుక్కున్నాడు. 'నంబర్ థర్టీన్' అంది ఆవిడ నావంక చూస్తూ. పదమూడు సంఖ్య వినగానే కొంచెం అదోలా అయింది. అప్పటికీ నాకు బి.పి. ఉండవలసిన దాని కంటె కొంచెం ఎక్కువుందనే విన్నాను. మన నమ్మకాలు, అదే భయాలు ఉండనే ఉన్నాయ్. దానికి తోడు పాశ్చాత్య విద్యాభ్యాసంగం వల్ల ఆ ప్రాచ్య భయాలూ సంక్రమించాయి. నిచ్చెన కింద నుంచి నడవక పోవడం పదమూడంటే భయం – ఇత్యాది విషయాలు.

బెడ్ నంబర్ మార్చించుకోవాలనుకున్నాను. అది ఎలా సాధ్యపడుతుందో తరువాత హౌస్ సర్జన్‌తో డిస్కస్ చేయాలనుకుని వార్డులోకి వెళ్లాను. నీలం స్క్రీన్ వెనకాల నా బెడ్ పక్క ఒక యువకుణ్ణి చూశాను. వైద్య విద్యార్థిట. అంతే – వెంటనే వెళ్లి నన్ను నేను పరిచయం చేసుకోవడం, నా కంప్లయింటు అతనికి చెప్పడం, అతని కేస్‌షీట్ తిరగేసి రాయడం అన్నీ పది నిమిషాలలో. జరిగిపోయాయి కూడా హౌస్ సర్జన్‌ను తీసుకువెళ్లడం చాలా ఉపయోగించిందనుకున్నాను. మొదటి పది నిమిషాల్లో వైద్య విద్యార్థి నాకు స్నేహితుడై పోయాడు.

మరుసటి రోజు నాకు ఆపరేషన్ రోజు.

వీలునామా. రాసినంత పనిచేసి – అంటే వీలునామా రాశానని కాదు – వీలురాయడం వాఘాయిత్యం లాంటిదనే నమ్మకంతో డైరీ రాయాల్సిన విషయాలూ, ఆస్తివివరాలు, రావలసినవీ, ఏబ్యాంకులో ఏముందీ రాసి, ఒక వేళ జరగకూడనిది జరిగితే కుటుంబానికి ఉండే అయివేజు ఏమిటో ఉజ్జాయింపుగా వేసి తృప్తిగా నిట్టూర్చి మరీ ఆస్పత్రి కొచ్చాను.

'చిన్న ఆపరేషన్‌గా ... నువ్వేందుకులే' అని శ్రీమతి చెప్పి పిల్లలందరినీ అదే కడసారపు చూపేమోనని ఒకసాని మనసారా చూసి మరీ వచ్చాను. కొంత వైరాగ్యం అలవరచుకుంటే తప్ప ఆపరేషన్ టేబిల్ ఎక్కడం అసాధ్యం. చచ్చిపోవడం అంటే ఓటమిని అంగీక

రించడం అన్నమాట. వయసు మీద పడుతున్న కొద్దీ ఓటమిని అంగీక రించడం అపహాస్యం పాలవడం లాంటిదన్న నమ్మకం. చావంటే భయం వేసే వయసు గిరిలోకి వచ్చాను.

భయం కలిగించే వాడూ, భయాన్ని నాశనం చేసేవాడూ భగవంతుడేనని, విష్ణుసహస్రంలో నామాలని ఉదహరిస్తూ మిత్రుడు రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది.

జీవితం, ఆలోచన ఆగిపోతుందన్న భయం ఎప్పుడు పోయిందో, భయం ఏమయిందో.

"ఆపరేషన్ చేస్తూన్నంతసేపు గొంతుతడి ఆరిపోతున్నా మాట్లాడు తూనే ఉన్నా - జనరల్ ఎనస్తీషియా ఇవ్వకూడదా అని అడిగా మిత్రుడి మిత్రుణ్ణి. నవ్వేసి - "యు లీవ్ ఇట్ టుమీ" అనగలిగాడు అంతే. జనరల్ కంటె లోకల్ ఇవ్వడమే ఒకవిధంగా మంచిదని. తరువాత చెప్పాడు. ఎంతవరకూ వచ్చిందని సర్జన్‌తో మాట్లాడుతూ బి.పి. ఆందోళన కలిగిస్తోందో అని ఎన్‌సైటిస్ట్‌ని అడుగుతున్నా. డోన్ట్‌బీ సైలంట్. ప్లీజు బీటాకింగ్" అన్నా.

వాళ్లు లోపల ఏమనుకున్నారో తెలియదు కాని ఒక అమ్మాయి ప్రారంభించింది. ఎస్సీలకంటే పార్ట్‌నోట్స్ బాగా రాశానని. ఎసిస్ట్ చేస్తున్న హౌస్ సర్జన్ అయి ఉండవచ్చు. "వేలాది పేపర్లు వేలేం" లక్షలు - పోనీ వేరే ననుకోండి - పేపర్లు నేనూదిద్దాను. ఎస్సేలకంటే పార్టునోట్సులకే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంది. "నా ఎలిమెంటులోకి వచ్చేశాను.

వెనక్కి తిరిగి చూసుకుంటే, భయం ఎప్పుడు, ఏక్షణాన, ఎలా పోయిందో ఆశ్చర్యంగా ఉంటుంది.

ఆపరేషన్ అయిన ఆరు గంటల్లో మంచం దిగి మెల్లగా వరండా మీదకు వెళ్లగలిగాను.

సాయంకాలం ఇంజక్షన్ ఇవ్వడానికి ఒక అమ్మాయి వచ్చింది. ఆవిడ పేరు నాకు తెలియదు. పాతికేళ్ల వయసుంటుంది. సన్నగా, చామన ఛాయగా, కుదిమట్టంగా ఉంది. కళ్లు మాత్రం మిలమిల మెరుస్తూ దేనినో వెదుకు తున్నట్టు ఉన్నాయి.

నా కేస్ షీట్ తిరగేసింది.

"ఆ కేస్ షీట్ ఎవరు రాశారో ... కొన్ని విషయాలు ..." నవ్వుతూ ప్రారంభించాను.

"కొన్ని విషయాలు ..." తల మీదికెత్తి ముఖం ప్రశ్నార్థకంగా చిట్లించింది.

"ఫర్ ఎగ్జాంపుల్ ఐ స్మోక్ ... డెస్ నాకు .. థిస్ థింగ్ ... యూ సీ లేటరల్ ... యూనో .. నాలుగేళ్ల నుంచి ఉన్నట్టు రాశారు. నాకు తెలిసి ఆరు నెల్లయిందంతే ..."

ఆవిడను సంభాషణలోదించాలని ప్రయత్నం. పక్క 'వై. వి.' నాతో చనువుగా ఉండడం. ఫర్ ఎగ్జాంపుల్ నా బెడ్ మీద కూచోడం లాంటివి - ఆవిడ చూసింది. నా వృత్తి వివరాలు కేస్ షీట్ మీదకు రాకుండా తగిన జాగ్రత్త తీసుకున్నాను.

కేస్ షీట్ వదిలేసి, 'ఆపరేషన్ నోట్సు రాయాలి' అంటూ వెళ్లి ఒక ట్రేలో ఒక అరడజను సిరంజ్ లోడ్ చేసి తీసుకొచ్చి నా బెడ్ మీద పెట్టింది.

"ఏ చేతికి వేసుకుంటారు?"

కుడి జబ్బ అందించాను

"చెయ్యి బిగపెట్టకండి ..."

"సారీ రిలాక్స్ చేసే ఉంచాను ..."

"అది మీకు తెలియదండీ. డాక్టర్లం మాకు తెలుస్తుంది ..."

శరీరంలో రక్తమంతటినీ ఒక క్షణం పాటు నా గుండె ముఖంలోకి పంపు చేసి ఉంటుంది. ఒక లిప్తలో ఆవిడ మళ్లీ అంది. 'ఉఫ్' అంటే కళ్లు మూస్తారు చూశారా. ఇన్ వలెంటరీ రియాక్షన్ అది.

నేను మౌనం వహించాను. అదేనా అతి కష్టంతో. ఇన్‌వలంటరీ అయితే నన్ను బిగించ వద్దని ఎలా అంది ... ఆమె కొంత స్టయిల్ కొట్టబోయిందని విశదమయింది. మరి నేను ఏమాత్రం ప్రవోక్ చెయ్య కుండా ఎందుకలా రియాక్టయింది?

సాధారణంగా ఆడపిల్లల దగ్గర చాలా జాగ్రత్త అయిన వాడిగా పేరు తెచ్చుకున్నవాడిని. కాలేజీలో ఇల్లాంటి అమ్మాయిలు నాకళ్ల ముందు నుంచి కొన్ని వేల మంది వెళ్లారు.

"ఆవిడ అంతేలెండి. కొంచెం నట్ లూజ్." 'వై.వి.' చెప్పాడు జరిగినదంతా ఒక కంట గమనిస్తున్నాడు కాబట్టి, నేనేమీ అనకుండానే.

అతనే చెప్పాడు - ఆవిడ పేరు కనకదుర్గని. కాని ఫర్ సమ్‌రీజన్ ఆవిడని భ్రమరం అని పిలవడం రివాజని. ఆపరేషన్ నోట్స్ కేస్‌షీట్‌లో వాళ్లు రాశాక చూశాను. షార్ట్ నోట్సు గురించి మాట్లాడింది ఈవిడే. నా ఆపరేషన్‌ను అసిస్ట్ చేసింది కనకదుర్గే.

నలుగురైదుగురు విద్యార్థుల నుంచి భ్రమరం గురించి కాలేజీలో తెలిసిన విషయాలు ఎలిసెట్ చేసేశాను.

ఆమె కులంతో ఐ యామ్ నాట్ ఇంటరెస్టెడ్. ఐ యామ్ ఇంటరెస్టెడ్ ఓన్లీ ఇన్ హెర్ సెక్స్. నే తెలుసుకున్న వాటిలో ఎంత నిజమో, ఎంత అబద్ధమో నాకు తెలియదు. మనుషుల గురించి బయట అనుకునేవి, నిజమూ ఒకటే అయి తీరుతుందని గ్యారంటీ లేదు. అయినా ఆరేళ్ల సాహచర్యంలో వైద్య కళాశాలల్లో ఒకరి గురించి ఇంకొకరికి ఎంతయినా తెలియడంలో ఆశ్చర్యం లేదు. వివరాలు అనవసరం కాని విషయం ఇది.

భ్రమరం హస్బెండు పెళ్లయిన కొన్ని నెల్లోనే ఇంగ్లండు వెళ్లి పోయాడు. ఆయన వెళ్లిన తరువాత వారానికి ఓ ఉత్తరం టంచనుగా వచ్చేవట. కొన్ని నెలల తరువాత ఉత్తరాలు ఆగిపోయాయి. ఈవిడ ఇక్కడ గంగ వెర్రి లెత్తిపోయిందిట. ఇల్లుతీసి పందిరేసి ఇంగ్లండు వెళ్లి కొన్ని వారాలుండి వచ్చేసిందిట.

ఈ పాయింటు దగ్గర టక్కున 'వై.వి.'ని ఆపేశాను.

"నే చెబుతా. ఐ కెన్ డయాగ్నోస్ ఇట్. సెక్స్ స్టార్వేషన్ సిండ్రోమ్."

పకపక నవ్వాడు వై.వి.

అతని కోసం వచ్చే వాళ్ల ఫ్రెండ్సందరికీ ఈ జోక్ చెప్పేశాడు. వాళ్లూ పగలబడి నవ్వారు. వాళ్లందరికీ కూడా నేను స్నేహితుడినయి పోయాను.

వీలునామా రాసినంత పనిచేసి ఆస్పత్రికి వచ్చినవాడిని, నాలో ఏమిటి ఈ మార్పు? నరకం అనుకున్న ఆస్పత్రిలో వింత ఆలోచనలు, వింత అనుభవాలు నాలో నోవెల్‌గా ఉన్నాయి.

వై.వి. కేస్ హిస్టరీ అంతావిని చాలా డేరింగ్‌గా నా ఒపీనియన్ చెప్పాను. కిందటికి మా గురువుగారొకరు చెప్పారు. తెలుగు దేశంలో కవీ, గాయకుడూ, వైద్యుడూ కాని వాడెవరూ ఉండడని. కాని నాకు మెడికల్ బుక్స్ పిచ్చి అనిచెప్పి, అతని భోజనం - టు బిగిన్ విత్ మజ్జిగా అన్నం తినమని బలవంతం చేసి నాకారియర్‌లో గరిటెడు అన్నం మజ్జిగా ఇచ్చాను. రెండో రోజు స్లయిడ్ కోసం తీసిన క్రాస్ సెక్షన్ అంతా దబ్బకాయ స్లయిస్. వై.వికి నామీద విపరీతమైన గురి కలిగింది. కడుపు నొప్పి అతను భయపడినట్టూ, వూహించినట్టూ రాకపోవడం అతనికి నామీద ఉండే గురి ఎక్కువయేటట్టు చేసింది.

నథింగ్ సక్ సీడ్స్ లైక్ ఎక్ సెస్ నేను మరో మాట చెప్పా.

"మిమ్మల్ని సర్జికల్ వార్డులో ఎందుకుంచారో తెలియడం లేదు. యూ షుడ్ బి ఇన్ ది మెడికల్ వార్డ్". అంతే మరుసటి రోజు ఒక పెద్ద డాక్టరు వచ్చి, 'రిఫర్ హిమ్ టు ది మెడికల్ వార్డ్' అన్నాడు.

మేం మరీ సన్నిహితులమై పోయాం. నా షేవర్‌తో అతను షేవ్ చేసుకోవడం, అతని ఎలక్ట్రోలైట్స్ రుచి కోసం నేను తాగడం - ఇద్దరం న్యూ ఇయర్స్ డే డ్యూటీ హౌస్ సర్జన్ రూమ్‌లో కేకూ్స టీలో

సెలిబ్రేట్ చేసుకోవడం చుట్టూ వాళ్లందరికీ ఆశ్చర్యాన్ని కలుగ చేశాయి.

తరచు భ్రమరాన్ని డిస్కస్ చేసుకుంటూ ఉండేవాళ్లం.

నా కుట్లు విప్పే రోజు వచ్చింది.

ఒక హౌస్ సర్జన్ రౌండ్స్ మీద వచ్చి "టుడే వుయ్ విల్ రిమూవ్ ది సూచర్స్" అన్నాడు.

"దానికేం? సూచర్ రిమూవింగ్ సెట్స్ ఉన్నాయి. ఐ విల్ డూ ఇట్" అంది భ్రమరం.

నాకు గుండెలో దడ పుట్టింది.

భ్రమరం - సెక్స్ స్టార్వేషన్ సిండ్రోమ్‌తో కళవళపడుతూందని పరోక్షంగానే కమ్మకట్టిన భ్రమరం కొంపదీసి నేనేన్నమాట ఆనోటా ఈనోటా పడి ఆమె వరకూ వెళ్లిందేమో... నేను చకచకా ఆలోచించేస్తున్నాను.

ఛీఫ్ సెలవులో ఉండడం, నేను ఆస్పత్రిలో చేరిన దగ్గర నుంచి డిస్చార్జి అయ్యేవరకు నాస్నేహితుడి స్నేహితుడే బాస్ అవడం మూలాన్న నాస్టే చాలా హాయిగా ఉందనే చెప్పాలి.

"ఎలా ఉంది?" అంటు రౌండ్సులో పదమూడు దగ్గర కొచ్చి అడిగాడు మిత్రుడు.

"ఫైన్. జస్ట్ ఎమినిట్" అతనికి వినపడేటట్లున్నాను. కాని అది అందరికీ వినబడే ఉంటుంది.

"ఏమిటి సంగతి?" తీరికిగా నాదగ్గర కొచ్చాడు అంత బిజీ షెడ్యూల్ లోనూ. వెనుక ఉన్న బృందం. పి.జీలు, హౌస్ సర్జన్లూ కాస్త దూరంగా ఉన్నారు. "మరేం లేదు. దట్ ఉమన్ వాంట్స్ టు రిమూవ్ మై సూచర్స్. ప్లీజ్ డోన్ట్ లెట్ హర్ డూ ఇట్. ఆడ డాక్టరు చేత చేయించుకోవడానికి భయంకాదు, బిడియమూకాదు. ఐ హేవ్ మై ఓన్ రీజన్స్ ... ఆస్క్ ది పీ.జీ. టుడూ ఇట్."

"ఓస్ – అదా! ప్రసాద్!"

"ఐ విల్ డూ ఇట్." ఒకాయన అనేశాడు.

"హమ్మయ్య" అనుకున్నాను.

భ్రమరాంబ వస్తూనే ఉంది. నా బెడ్ దగ్గర సైలెంట్‌గా తన పని చేసుకుంటూ వెళ్ళిపోతూంది. దగ్గరలో ఎవరితోనైనా చిన్నతగవు వేసుకుంటుం దేమోనని చూస్తున్నా.

హఠాత్తుగా స్ట్రేంగ్యులేటెడ్ హెర్నియా కేసొకటి ఎమర్జన్సీ నుంచి వచ్చింది.

ఏపేషెంటును ఆపరేషన్‌కు ప్రిపేర్ చేస్తున్నారు.

భగవంతుడు కష్టాల్లో ఉన్న మనిషిని ఆదుకోవడానికి స్వంతగా దిగిరాడు.

భ్రమరం వచ్చింది. "ఏయ్, మిస్టర్ ... ఎనీమా ఇవ్వమని ఎవరు చెప్పారు? కొంపతీసేద్దువ్ ..."

"కాదమ్మా ..." ఏమిటో గొణుక్కుంటూ కేన్ తీసుకుని వెళ్ళిపోయాడు వార్డ్ బోయ్.

"ఐ.వి. ఫ్లూయిడ్స్ పెట్టాలి సిస్టర్." భ్రమరం చెప్పింది.

సిస్టర్ కుడిచేతికి డెక్స్ట్రోజ్ పెట్టింది. ఎడమ చేతికి వెయిన్ దొరక లేదు.

భ్రమరం ట్రై చేస్తూంది. అయిదు నిమిషాలు అయింది. భ్రమరానికి చెమట పట్టింది. వెయిన్ దొరకలేదు.

పి.జీ. ఒకతను ఆ వంక చూస్తూ అక్కడో క్షణం ఆగాడు.

"లెట్ మీ ట్రై" అతను అంటాడనుకున్నాను. ఒకవేళ అంటే "ఐ కేన్ డూ యిట్" అని అతని మీద భ్రమరం విరుచుకుని పడితీరుతుంది.

ముగింపెలా ఉంటుందోనని ఉత్సుకతతో అటే చూస్తున్నా.

"ఇఫ్‌యూడోన్ట్ మైండ్, యూ ప్లై" అని భ్రమరం పిజీకి సిరంజి అందించేసింది.

నేను డిస్చార్జి అయే రోజు ఏడు గంటలకే తయారయిపోయాను. పన్నెండయితే కాని డిస్చార్జి కాగితాలు రావన్నారు. చుట్టుపక్కల పేషెంట్లను వదలి వెళ్లడం కూడా కష్టంగానే ఉంది.

ఎవరైనా వెళ్లిపోతున్నప్పుడు నాకూ రెండు మూడు రోజుల కిందటి నుంచీ అలాగే ఉండేది.

వైద్య విద్యార్థి గుండె బాదుకున్నంత పని చేశాడు.

"నాకిక బోరుకొట్టేస్తుంది బాబూ. మీరూ వెళ్లిపోతున్నారు ... హాస్టల్‌కు వస్తుండండి"

"ఓ ఎస్ మావాడు ఎలానూ అక్కడే ఉన్నాడు. తప్పకుండా వస్తా."

"ఇంతకీ మీరింకా ఇక్కడెందుకు హాస్టల్‌కు వెళ్లిపోవచ్చుగా"

ఏమిటో అతను సందిగ్ధంలో పడ్డట్లనిపించింది.

భ్రమరం వచ్చింది "గుడ్ మార్నింగ్" అంటూ.

నేను వింతగా చూశాను. భ్రమరం పలకరించింది నన్ను కాదు. నా వెనక నుంచి వస్తున్న హౌస్ సర్జన్‌ని.

అతనే నా సూచర్స్ రిమూవ్ చేసినతను. నాతో చాలా ఫ్రెండ్లీగా ఉంటూ వచ్చాడు.

"మిమ్మల్ని పెర్ఫిరల్స్‌కు వేశారట ..."

"మిమ్మల్ని?" అతను అడిగాడు.

"గైనిక్."

ఎందుకో అతను నిరుత్సాహంగా కనిపించాడు. "మీ కెలా తెలుసు"

"నా ఫ్రెండు పోస్టింగ్‌లో చూసింది - ఆఫీసులో" భ్రమరం ఎటో వెళ్లింది. ఆ పహాస్ సర్జన్ ఇంకొకరితో చెబుతున్నాడు" "నన్ను పెర్ఫిరల్‌కి వేశారట. ఆ క్రేక్ భ్రమరం చెప్పింది ..."

భ్రమరాన్ని అందరూ వెర్రిదాని కింద కట్టేశారన్నమాట.

ఎందుకని? నాలో జాలి మొదలయింది.

పెళ్లి అయిపోయి, ఆ కారణం చేత వాళ్లతో మిగిలిన వాళ్లలా కలివిడిగా ఉండడం లేదనా? ఆమె నోటి దురుసుతనం వల్లనా?

సిల్లీమోరల్స్ కోసం. భ్రమరాంబ భర్తకూ, తనకూ వేలమైళ్ల దూరం, సముద్రం ... మధ్య నుంచుని పాత కాలం మనిషిలా వయసు చెడగొట్టుకుంటోందనా?

ప్రేమ కోసం కొద్ది దిగులు పెట్టుకొని కర్రకట్టేస్తోందనా?

ఆలోచనలో పడ్డాను.

"సెక్స్ స్టార్వేషన్ సిండ్రోమ్" అనేశాను. నేననవలసిన మాటేనా అది. కాగితాలు తీసుకోవడం కూడా అయిపోయింది.

బ్యాగ్ సర్ది, కుర్రవాడి కిచ్చి మరోమాటు అందరి దగ్గరా సెలవు తీసుకుంటూ భ్రమరం కోసం వెదికాను. ఆవిడ కనబడలేదు.

మరో నెల తరువాత కె.జి.హెచ్. గేటు దగ్గర బస్ కోసం వెయిట్ చేస్తూ ఉంటే చకచకా అడుగు వేసుకుంటూ ఆస్పత్రిలో నుంచి బయటకు వస్తోంది.

"గుడ్ మార్నింగ్" అన్నా.

"హలో. వై డిడ్ యూ నాట్ కమ్. ఎస్టర్ డే ..."

ఏమిటేమిటో అడిగేస్తోంది భ్రమరం మరో తెల్లకోటు చేతి మీద వేసుకున్న అమ్మాయిని. ఆమె నావంక చూడనే లేదు.

ఇది ఆమె నామీద తీసుకున్న ప్రతీకారమా?

“అయామ్ సారీ” అని అనాలనిపించింది. అయితే నావంక చూస్తే కదా. వయసు చెడుతున్న వాళ్లని చూసి జాలి కలగాలన్న జ్ఞానోదయం అప్పటికీగానీ నాకు కాలేదు.

వయసు చెడ్డది మరి.

ఇంకా ఆలోచిస్తే వయసూ చెడ్డదికాదు. ఆస్పత్రిలో ఉన్నంత సేపూ మరి పని లేక నామెదడు సైతాను కార్ఖానా అయిందేమో. ఎనివే. ఐయామ్ సారీ ఫర్ భ్రమరం.

7.10.97

ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో 15-11-78 ప్రచురితమైనది.